


# సత్యవాక్యం

# THE WORD OF TRUTH

## క్రైస్తవ మాసపత్రిక

DECEMBER - 2004

## భూవంశములు ఆశీర్వదించబడును

T E J A T V

# సత్యవాణి
# టి.వి. కార్యక్రమములను

M A A T V

ప్రతి మంగళవారం : ఉదయం 6:30 గం॥లకు

**మా టి.వి.**లోను

ప్రతి శనివారం : ఉదయం 6:30 గం॥లకు

**తేజ ఛానల్** లోను చూడండి.

(కాకినాడలో మాత్రమే)

ప్రతి గురువారం : **SITI కేబుల్ & IN కేబుల్‌లో**

ఉదయం 7:00 గంటలకు,

సాయంత్రం 5:30 గంటలకు

ప్రసంగీకులు : Bro. **జాషువా గూటం**

సత్యసువార్తను వినండి !!

మీ బంధు మిత్రులకు వినిపించండి !!!

# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

P.O. Box-80, Kakinada, A.P. 533 001
Ph : 0884 - 2363722

Editor :

**Joshua Gootam**

*Pleading for Restoration of First Century Christianity*

సంపుటిక 25 డిశంబర్ 2004 సంచిక 5


## మంచి ఒప్పుకోలు

(The Good Confession)

యేసుక్రీస్తు నామమును ప్రతివారు ఒప్పుకొన వలెనని బైబిలు బోధించుచున్నది. "యేసు ప్రభువని నీ నోటితో ఒప్పుకొని, దేవుడు మృతులలో నుండి ఆయనను లేపెనని నీ హృదయమందు విశ్వసించిన యెడల నీవు రక్షింపబడుదువు. ఏలయనగా నీతి కలుగునట్లు మనుష్యుడు హృదయములో విశ్వసించును, రక్షణ కలుగునట్లు నోటితో ఒప్పుకొనును" అని రోమా 10:9-10 చెప్పుచున్నది. గనుక రక్షణ పొందుటకు మనము యేసు ప్రభువని, దేవుని కుమారుడని ఒప్పుకొనుట అత్యవసరమై యున్నది.

ఒక ప్రత్యేక విషయమందలి విశ్వాసమును బహిరంగముగా ప్రకటించుటను మనము ఒప్పుకోలు అని చెప్పుకొనవచ్చును. క్రైస్తవులు కానివారు క్రైస్తవులగుటకు చేయు క్రియలలో ఒప్పుకోలు ఒకటి. ఒప్పుకోలు చేయకముందు ఒకడు క్రీస్తు నందు

విశ్వాసియై యుండవలెను. అతడు విశ్వాసి కానియెడల విశ్వాసినని ఎట్లు ఒప్పుకొన గలడు? - నీతి కలుగునట్లు మనుష్యుడు హృదయములో విశ్వసించును, రక్షణ కలుగునట్లు నోటితో ఒప్పుకొనును అని వాక్యము చెప్పుచున్నది. గనుక నీవు విశ్వసించిన తరువాత నీ పాపముల విషయమై మారుమనస్సు పొంది, నీ హృదయములో యేసును గూర్చి ఉన్నట్టి విశ్వాసము ఒప్పుకొనవలయును.

మనుష్యులు యేసును గూర్చి ఏమని ఒప్పుకొనవలెను? యేసు ఒకసారి తనను గూర్చి జనులు ఏమని చెప్పుకొనుచున్నారని తన శిష్యుల నడిగెను. "వారు కొందరు బాప్తిస్మమిచ్చు యోహాననియు, కొందరు ఏలీయా అనియు, కొందరు యిర్మీయా అనియు లేక ప్రవక్తలలో ఒకడనియు చెప్పుకొనుచున్నారనిరి. అందుకాయన - మీరైతే నేను ఎవడనని చెప్పుకొనుచున్నారని వారిని అడిగెను. అందుకు సీమోను పేతురు నీవు సజీవుడవగు దేవుని కుమారుడవైన క్రీస్తువు" అని ఒప్పుకొనెను. ఇక్కడ పేతురు యేసును ఒప్పుకొనినరీతిగ ప్రతివారు ఆయనను ఒప్పుకొనవలెను. "యేసును దేవుడు ప్రభువుగాను, క్రీస్తుగాను నియమించెను" అని పెంతెకోస్తు దినమున పేతురు తాను చేసిన మొట్టమొదటి సువార్త ప్రసంగములో ఒప్పుకొనెను (అపొ.కా. 2:36). "పరలోకమందున్న వారిలో గాని, భూమి మీద ఉన్నవారిలో గాని, భూమిక్రింద ఉన్న వారిలో గాని ప్రతివాని మోకాలును యేసు నామమున వంగునట్లును, ప్రతివాని నాలుకయు తండ్రియైన దేవుని మహిమార్థమై యేసు క్రీస్తు ప్రభువని ఒప్పుకొనునట్లును, దేవుడు ఆయనను అధికముగా హెచ్చించి, ప్రతి నామమునకు పై నామమును ఆయనకు అనుగ్రహించెను" అని ఫిలిప్పీ 2:10లో అపొ.పౌలు వ్రాసెను.

యేసు ప్రభువని, దేవుని అద్వితీయ కుమారుడని ప్రతి మానవుడు విశ్వసించవలెనని దేవుడు కోరుచున్నాడు. ఆయనను మనము విశ్వసించుటకు వీలుగ ఆయనను గూర్చిన సువార్త సర్వసృష్టికి ప్రకటింపబడుచున్నది. యేసును గూర్చి అందరు తెలుసుకొనునట్లు బైబిలు గ్రంథము భూలోకములో యున్న అన్ని భాషలలోను ఈనాడు లభించుచున్నది. అందువలన "యేసే క్రీస్తయి యున్నాడని నమ్ము ప్రతివాడును దేవుని మూలముగా పుట్టియున్నాడు" యేసు దేవుని కుమారుడని నమ్మువాడు తప్ప లోకమును జయించువాడు మరి ఎవడు?" అని భక్తుడైన యోహాను వ్రాసెను (1 యోహా 5:1, 5). యేసు దేవుని కుమారుడని నీవు ఒప్పుకొనగలిగితే దానికి మించిన మంచి

ఒప్పుకోట్లు మరేమి యున్నది?

రక్షణ పొందగోరు ప్రతివాడును యేసుక్రీస్తు దేవుని కుమారుడు అని ఒప్పు కొనవలెను. నీతి కలుగునట్లు మనుష్యుడు హృదయములో విశ్వసించును, రక్షణ కలుగునట్లు నోటితో ఒప్పుకొనును అని వాక్యము చెప్పుచున్నది. రక్షణ కలుగునట్లు యేసును ప్రతివాడు ఒప్పు కొనవలెను. మీరు నన్ను ఒప్పుకొనిన యెడల నేను మిమ్మును ఒప్పుకొందును అని యేసు చెప్పుచున్నారు. ఆయన ఇట్లనుచున్నాడు: "మనుష్యుల యెదుట నన్ను ఒప్పుకొను వాడెవడో పరలోకమందున్న నాతండ్రి యెదుట నేనును వానిని ఒప్పుకొందును. మనుష్యుల యెదుట ఎవడు నన్ను ఎరుగ నననో వానిని పరలోకమందున్న నాతండ్రి యెదుట నేనును ఎరుగనందును" (మత్తయి 10:32, 33).

యేసు ప్రభువు దేవుని కుమారుడు అను నీ విశ్వాసమును నోటితో ఒప్పుకొన వలెను. ఏలయనగా నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును అని యేసు మార్కు 16:16లో చెప్పెను గదా. దీనిని బట్టి విశ్వసించిన వాడే బాప్తిస్మము పొందనర్హుడు అని తేటబడుచున్నది. ఎవడైనను యేసు నందు విశ్వాసముంచు చున్నాడో లేదో అతడు నోటితో చెబితేనే గాని మనకెట్లు తెలియును? అందువలన బాప్తిస్మము పొందగోరు వానిని, అతడు యేసు దేవుని కుమారుడని నమ్ముచున్నాడో లేదో ప్రశ్నించి తెలిసికొనవలెను. యేసునందు విశ్వాసము లేనివాని కెవనికీని బాప్తిస్మమియ్యవలెనని వాక్యము ఎన్నడూ బోధించుటలేదు. ఒకడు యేసునందు విశ్వసించి, తన మనస్సును పాపముల నుండి మార్చుకొని, తన విశ్వాస మును ఒప్పుకొనినప్పుడే బాప్తిస్మము పొంద వచ్చును. దీనిని బట్టి పసిబిడ్డలు బాప్తిస్మము పొందుటకు అర్హులు కారు. వారు నమ్మ లేరు, మారుమనస్సు పొందుటకు వారు పాపములేనివారు, వారు యేసే దేవుని కుమారుడు అని ఒప్పుకొనలేరు. గనుక పసికందులకు బాప్తిస్మమిచ్చు ఆచారము కేవలము దైవవిరుద్ధమైనది అని మనము గ్రహించవలెను.

యేసు దేవుని కుమారుడని ఒప్పు కొనుటకు సిద్ధముగా నీ వున్న యెడల దానిని మనుష్యుల యెదుట ఒప్పుకొన వలెను. నీ విశ్వాసమును గూర్చి ఇతరులును వినవలెనని దేవుడు కోరుచున్నారు గనుక వారి యెదుట నీవు యేసును ఒప్పుకొన వలెను. అపో.కార్యములు 8వ అధ్యాయ ములో ఐతియోపీయుల రాణి దగ్గర

ఆర్థికమంత్రిగా పనిచేయుచున్న నపుంసకు డొకడు క్రైస్తవునిగా మారుటను గూర్చి మనము చదువగలము. అతడు తన రథములో ప్రయాణమై పోవుచు యెషయా వ్రాసిన గ్రంథము చదువుచుండెను. ఫిలిప్పు అను సువార్తికుడు అతనిని కలసికొని, అతడు చదువుచున్న లేఖనముల నను సరించి అతనికి యేసును గూర్చిన సువార్త ప్రకటించెను. వారు త్రోవలో వెళ్ళుచుండగా నీళ్ళున్న యొకచోటికి వచ్చినప్పుడు నపుంస కుడు - ఇదిగో నీళ్ళు, నాకు బాప్తిస్మ మిచ్చుటకు ఆటంకమేమని అడిగి రథము నిలుపుమని ఆజ్ఞాపించెను. అప్పుడు ఫిలిప్పు నీవు పూర్ణ హృదయముతో విశ్వసించిన యెడల పొందవచ్చునని చెప్పెను. అతడు యేసుక్రీస్తు దేవుని కుమారుడని విశ్వసించు చున్నానని యుత్తర మిచ్చెను. అంతట ఫిలిప్పు, నపుంసకుడు ఇద్దరును నీళ్ళలోనికి దిగిరి. అంతట ఫిలిప్పు అతనికి బాప్తిస్మ మిచ్చెను. నపుంసకుడు సంతోషించుచు తన త్రోవను వెళ్ళెను (అపొ.కా. 8:26-39).

రక్షణ పొందవలెనంటే నీవు క్రీస్తును ఒప్పుకొనవలెను. ఈ ఒప్పుకోలు రక్షణ కొరకు చేయవలెను. బాప్తిస్మము ద్వారా ఒకడు క్రీస్తు ఇచ్చు రక్షణలోనికి, క్రీస్తు లోనికి ప్రవేశించును. అయితే బాప్తిస్మము పొందకముందు ఒకడు తన విశ్వాసమును ఒప్పుకొనవలెను. ఫిలిప్పు నపుంసకునికి బాప్తిస్మమియ్యకముందు తన విశ్వాసమును గూర్చి అడిగెను. యేసు దేవుని కుమారుడని నేను నమ్ముచున్నాను అని ఆ నపుంసకుడు తన విశ్వాసమును ఒప్పుకొనెను.

బాప్తిస్మము పొందకముందు పాపము లను బహిరంగముగా మనుష్యుల యెదుట ఒప్పుకొనవలెనని దేవుని వాక్యము కోరుట లేదు. అట్లు ఒప్పుకొనిన వారిని గూర్చి కూడ క్రొత్త నిబంధనలో మనకు కన్పించుటలేదు. మన పాపములను దేవుని యెదుట ఒప్పు కొనవలెను. "మన పాపములను మనము ఒప్పుకొనిన యెడల ఆయన నమ్మదగిన వాడును, నీతిమంతుడును గనుక ఆయన మన పాపములను క్షమించి సమస్త దుర్నీతి నుండి మనలను పవిత్రులనుగా చేయును" అని వాక్యము చెప్పుచున్నది. గాని మన విశ్వాసము నయితే మనుష్యులు యెదుట నోటితో ఒప్పుకొనవలెనని కూడ దైవవేదము చెప్పుచున్నది.

నీవు రక్షణ పొందగోరుచున్నావా? అయితే యేసు నందు విశ్వాసముంచుము, నీ పాపములను విసర్జించుము, నీ విశ్వాస మును ధైర్యముగా ఒప్పుకొని బాప్తిస్మము పొందుము. నీవు అట్లు చేయగలిగిన యెడల క్రీస్తు తన రక్షణ భాగ్యములో నిన్ను

చేర్చుకొనును. అయితే యేసు ప్రభువని ఒప్పుకొనుటకు నీవు సిగ్గు పడుచున్నావా? అంత్యదినమందు ఆయన నిన్ను గూర్చి సిగ్గుపడును. కొందరు యేసు దేవుని కుమారు డని నమ్మిదురు గాని సమాజము నుండి వెలివేయబడుదుమేమో యని భయపడి వారు ఒప్పుకొనుట లేదు. అట్టివారు దేవుని మెప్పుకంటే మనుష్యుల మెప్పును ఎక్కువగా ఆపేక్షించుచున్నారు అని బైబిలు చెప్పుచున్నది (యోహాను 12:42, 43). ఇప్పుడు నీవు యేసును ఒప్పుకొనినను, ఒప్పుకొనక పోయినను సరేగాని ఒకానొక దినము రాబోవుచున్నది. ఆ దినమందు ప్రతివాని మోకాలును యేసు నామమున వంగును. ప్రతివాని నాలుకయు యేసుక్రీస్తు ప్రభువని ఒప్పుకొనును. ఆ దినమే తీర్పు దినము, ఆ దినమే యేసు ప్రభువు మరల వచ్చుదినము. ఆయనను ధైర్యముతో ఎదుర్కొనవలెనంటే నీవు ఇప్పుడు ఆయనను ఒప్పుకొనవలెను (రోమా 14:11).

ఉపమానమాలిక :

# జాగ్రత్త కలిగి యుండుడి

## (Be On Guard)

మార్కు 13:37లో యేసు ప్రభువు, "నేను మీతో చెప్పునది అందరితోను చెప్పుచున్నాను; మెలకువగా నుండుడని" చెప్పారు. ఆత్మీయ విషయాల్లో మన మెల్లప్పుడు మెలకువగా యుండాలి, లేదా జాగ్రత్త కలిగి యుండాలి. "నిబ్బరమైన బుద్ధి గలవారై మెలకువగా ఉండుడి; మీ విరోధియైన అపవాది గర్జించు సింహమువలె ఎవరిని మ్రింగుదునా అని వెదకుచు తిరుగుచున్నాడని" అపో. పేతురు ద్వారా పరిశుద్ధాత్ముడు చెప్పుచున్నాడు (1 పేతురు 5:8). ప్రభువు ఎప్పుడు వచ్చునో ఎవరు ఎరుగరు గనుక మనము ఎల్లప్పుడు మెలకువగా యుండాలి (1 థెస్స 5:2).

కొరింధులోని క్రైస్తవులు విశ్వాసమందు నిలిచియుండి మెలకువగా యుండాలని పౌలు వారిని హెచ్చరించాడు: "మెలకువగా ఉండుడి, విశ్వాసమందు నిలుకడగా ఉండుడి, పౌరుషము గలవారై ఉండుడి, బలవంతులై ఉండుడి" యని అతడు వారిని

హెచ్చరించాడు (1 కొరింది, 16:13). మనము దేనిని గూర్చి జాగ్రత్త, లేక మెలకువ కలిగి యుండాలో, ఏలాగు కలిగి యుండాలో లేఖనములలో మనకు బాగుగా తెలియ జేయబడినది. దుష్టుని యొక్క అగ్ని బాణములను విజయవంతముగా ఎదుర్కొను శక్తి లేఖనముల యందు మనకీయబడినది. మనం ఏయే విషయాలను గూర్చి జాగ్రత్త కలిగి యుండాలో క్లుప్తముగా మనకీయబడిన కొద్ది సమయములో తెలిసి కొందాము:

మనము ఆత్మీయ దుష్టత్వము గూర్చి జాగ్రత్త కలిగి యుండాలి. ఎఫెసీ 6:11, 12లో అపొ.పౌలు ఇట్లు చెప్పుచున్నాడు: "మీరు అపవాది తంత్రములను ఎదిరించుటకు శక్తిమంతులగునట్లు దేవుడిచ్చు సర్వాంగ కవచమును ధరించు కొనుడి. ఏలయనగా మనము పోరాడునది శరీరులతో కాదు గాని, ప్రధానులతోను, అధికారులతోను, ప్రస్తుత అంధకార సంబంధులగు లోకనాధులతోను, ఆకాశ మండల మందున్న దురాత్మల సమూహములతోను పోరాడు చున్నాము". ప్రభువు యొక్క సైనికుని కవచము ధరించి అపవాది యొక్క తంత్రములను మనము ఎదుర్కొనాలి (2 కొరింధీ 2:11). లక్షలాది ప్రజల జీవితాల్లో దుష్టుని యొక్క శక్తిని గమనించి, పరిశుద్ధ వాక్యమును సరిగ నుపదేశించుట ద్వారా మనం దుష్టత్వాన్ని జయించగలము (2 తిమో 2:15).

మనం దుష్టత్వాన్ని బలముగా ఎదిరిస్తే దాన్ని జయించగలము. "కాబట్టి దేవునికి లోబడి యుండుడి. అపవాదిని ఎదిరించుడి అప్పుడు వాడు మీ యొద్ద నుండి పారి పోవును" అని భక్తుడైన యాకోబు చెప్పుచున్నాడు (యాకో 4:7). ప్రభువు మాట చొప్పున జీవించ నిశ్చయించు కొన్నప్పుడు, చివరకు మనం విజేయుల మౌతాము.

మానవ గర్వాంధకారాన్ని గూర్చి మనం జాగ్రత్త కలిగి యుండాలి. మానవుని నాశనమునకు నడిపే పాపము - గర్వము. "నాశనమునకు ముందు గర్వము నడచును. పడిపోవుటకు ముందు అహంకారమైన మనస్సు నడచును" అని జ్ఞానియైన సొలొమోను చెప్పాడు (సామె 16:18). దేవుని నుండి మనలను వేరుచేయు ఈలోక సంగతులైన మూడింటిలో ఒకటి జీవపు డంబమై యున్నది. "లోకములో ఉన్నదంతయు, అనగా శరీరాశయు నేత్రాశయు జీవపుడంబమును తండ్రి వలన పుట్టినవి కావు; అవి లోక సంబంధమైనవే" యని భక్తుడైన యోహాను వ్రాసాడు (1 యోహాను

2:16). అహంకారము వలన ఒకడు నాశనమవుట తథ్యము. "ప్రభువు మెచ్చుకొనువాడే యోగ్యుడుగాని తన్ను తానే మెచ్చుకొనువాడు యోగ్యుడు కాడు" (2 కొరింధీ 10:18). అందువలన "తాను నిలుచుచున్నానని తలంచుకొను వాడు పడకుండునట్లు జాగ్రత్తగా చూచు కొనవలెను" (1 కొరింధీ 10:12).

ఈ లోక సంపదలలో యున్న మోసమును గూర్చి మనం జాగ్రత్త కలిగి యుండాలి. ధనవంతుడైన బుద్ధిహీనుని గూర్చి ప్రభువు చెప్పిన ఉపమానాన్ని మనం గ్రహించాలి. అతడు దేవునినిగాక తన సంపదనే నమ్ముకొన్నాడు. అనేక సంవత్సరముల మట్టుకు విస్తారమైన ఆస్థిని సమకూర్చు కొన్నాను గనుక, తిని త్రాగి సుఖిస్తానని అతడను కొన్నాడు. అతడనేక సంవత్సరాలు ఉంటా ననుకొన్నాడు గాని ఆ రాత్రే దేవుడు తన ప్రాణాన్ని అడిగారు. అతని సంపాదన అంతా అతనికి మోసమై పోయింది (లూకా 12వ అధ్యా.) అదే రకమైన ధన మోసాన్ని బట్టి ఇస్కారియోతు యూదా తన నిత్య జీవాన్ని ముప్పది వెండి నాణెములకు అప్పగించేసాడు. ధనవంతుడైన యౌవనుడు నిత్యజీవాన్ని వెదకుచు యేసు దగ్గరకు వచ్చాడు గాని, నీ ఆస్థిని అమ్మి బీదలకిమ్ము, నీవు వచ్చి నన్ను వెంబడింపుమని ప్రభువు చెబితే అతడు ముఖము చిన్నబుచ్చుకొని పోయాడు (మత్తయి 19 అధ్యా.) . ఈ లోక సంబంధమైన ఆస్థి వలన తప్పిపోయిన కుమారుడు తప్పులో అడుగు వేసాడు.

మొదటి శతాబ్దపు సంఘములో మొదట రికార్డు చేయబడిన పాపము ధనాశ. అననీయ సప్పీరా దంపతులు ధనాన్ని బట్టి మోసగించబడి తమ ప్రాణమును ఆత్మను ఒక్కరోజే కోల్పోయారు (అపో.కా. 5 అధ్యా.). భూమి మీద ధనము కూర్చుకొనుట కంటే పరలోకమందు ధనము కూర్చుకొనుట శ్రేష్ఠమైనదని యేసు ప్రభువు బోధించారు (మత్త 6:19, 20). అపో.పౌలు ఇట్లు బోధించాడు : "సంతుష్టి సహితమైన దైవభక్తి గొప్ప లాభ సాధనమై యున్నది. మన మీలోకములోనికి ఏమియు తేలేదు, దీనిలో నుండి ఏమియు తీసికొని పోలేము. కాగా అన్న వస్త్రములు గలవారమై యుండి వాటితో తృప్తి పొంది యుందము. ధనాపేక్ష సమస్తమైన కీడులకు మూలము ఇహమందు ధనవంతులైన వారు గర్విష్టులు కాక ఆస్థిరమైన ధనమందు నమ్మిక యుంచక సుఖముగా అను భవించుటకు సమస్తమును మనకు ధారాళముగ దయచేయు దేవుని యందే నమ్మిక యుంచవలెను" (1 తిమో 6:7-17).

దుర్భాషను గూర్చి మనము జాగ్రత్త కలిగి యుండాలి. అది వ్యర్థమైన మాటలు పలుకుటగాని, దుష్ప్రవర్తనగాని, ఏదైనను మనము అపవాది యొక్క తంత్రములను గూర్చి ఎల్లప్పుడు మెలకువగా యుండాలి. "హృదయమందు నిండియుండు దానిని బట్టి నోరు మాటలాడును గదా. సజ్జనుడు తన మంచి ధననిధిలో నుండి సద్విషయములను తెచ్చును. దుర్జనుడు తన చెడ్డ ధననిధిలో నుండి దుర్విషయములను తెచ్చును. నేను మీతో చెప్పునదేమనగా, మనుష్యులు పలుకు వ్యర్థమైన ప్రతి మాటను గూర్చియు విమర్శ దినమున లెక్క చెప్పవలసి యుండును. నీ మాటలను బట్టి నీతి మంతుడవని తీర్పు నొందుదువు. నీ మాటలను బట్టియే అపరాధివని తీర్పు నొందుదువని" యేసు ప్రభువు బోధించారు (మత్త 12:34-37).

అపవాది తంత్రములను జయించాలంటే యేసు ప్రభువు ఒక్కడే మనకు మార్గము. ఆయన మాటను విని, ఆయన యందు విశ్వాసముంచి; ఆయనకు లోబడి జీవించిన యెడల సమస్త కల్మషము నుండి యేసు ప్రభువు మనల్ని దూరం చేయగలరు.

✍ - జాషువా గూటం

# విశ్వాసము ద్వారా కృప

(Grace Through Faith)

నేను క్రీస్తు సంఘస్తుడను కాక ముందు ఒక స్త్రీ భర్తను సందర్శించెను. అతను క్రీస్తు సంఘ సభ్యుడు. అతను కేన్సర్ సోకి మరణించుటను సిద్దంగా వున్నాడు. అతను మాట్లాడుతూ 'బోధకుడా! క్రీస్తు సంఘము బ్రతకడానికి మంచిది చావడానికి చెడ్డది' అన్నాడు. అతనే కాదు అనేక మంది అలాంటి సందిగ్ధా వస్తలోనే వున్నారు. విషయ మేంటంటే నేను పాపంలేని పరిపూర్ణ జీవితం జీవించనందున నేనెలా రక్షింపబడతాను' అని అంటారు.

ఇలాఆలోచించేవారు పాతనిబంధనలోని రక్షణ ఉద్దేశంలో ఆలోచిస్తున్నారు. మోషే ధర్మశాస్త్రము పాపరహిత సంపూర్ణత్వాన్ని శాసిస్తోంది. పౌలు దానికి తగ్గట్లుగా జీవించుట సాధ్యము కాదని చెప్పాడు (రోమా 7:10,15). అలా పరిపూర్ణత కలిగిన

వారు యేసు తప్ప మరెవరూ లేరు. మనము జీవించగలిగిన పరిపూర్ణ స్థితికంటే తక్కువగా జీవించుట క్రొత్త నిబంధనా క్రైస్తవ్యపు ఆలోచన కాదు. మనం చేసిన మంచి పనులవల్ల కానీ ధర్మశాస్త్రము వల్లకానీ మనం రక్షింపబడలేము. గాని మీరు విశ్వాసము ద్వారా దేవుని కృప వల్ల రక్షింపబడి యున్నాము (ఎఫెసీ 2:8,9).

మోషే ధర్మశాస్త్రమును బట్టి కూడ తన నుండి వేరైన వారికి రక్షణలేదని దేవుడు చూపించారు. ఒకడు మొదటిసారి ఏదైనా పాపము చేసినా అతడు ఆజ్ఞలన్నిటిని మీరినట్లే. 'ఎవడైనను ధర్మశాస్త్ర మంతయూ గైకొని ఒక ఆజ్ఞ విషయములో తప్పిపోయిన ఎడల ఆజ్ఞలన్నిటి విషయములో అపరాధి యగును (యాకోబు 2:10).

ధర్మశాస్త్రము నందు దాని దాని క్రియల యందు దాని, ఎడ్ల యొక్కయు, మేకల యొక్కయు రక్తము పాపముల తీసివేసినట్లు నిదర్శనము లేదు (హెబ్రీ 10:1-4) (గలతీ 2:16). అయితే అబ్రహాము, ఇస్సాకు, యాకోబు, మోషే, దావీదు మున్నగు పితరులు ఎలా రక్షించబడ్డారు? కేవలం వారి విశ్వాసము దేవునికృప మాత్రమే. నీతిమంతుడు విశ్వాసమూలము గానే జీవించును (హబక్కూకు 2:4, రోమా 1:17, గలతీ 3:11, హెబ్రీ 10:38). కొందరు క్రొత్తనిబంధనలో కృప మాత్రమే చాలదని తలస్తారు. అది సరికాదు. 'నోవహు యెహోవా దృష్టిలో కృప పొందిన వాడాయెను' (ఆది 6:8). పాతనిబంధనలో దేవుని కృప ద్వారా విశ్వాసములో జీవించిన వారు మంచి సాక్ష్యము పొందారు. అయితే దేవుడు మన కొరకు మరి శ్రేష్ఠమైన దానిని ముందుగా సిద్ధపరచెను (హెబ్రీ 11:39, 40). పురాతనము నుండి మోషే నియమించినట్లు విశ్వాసములో జీవించిన వారిని కూడ క్రీస్తు మనలో ఒకనిగా చేర్చుకొని యున్నాడు (ఎఫెసీ 1:10). ఒకడు పూర్వము ఏమి చేసి యున్నప్పటికీ డితడు క్రీస్తు సువార్తను విశ్వసించి తన గత పాపముల నిమిత్తము పశ్చాత్తాపపడి క్రీస్తు ప్రశస్థ నామమును ఒప్పుకొని క్రీస్తుతో కూడా పాతిపెట్టుబడ్డట్టు బాప్తిస్మం పొందితే దేవుడు వానిని రక్షిస్తాడు (మార్కు 16:15 అపొ.కా. 2:38, రోమా 10:9, 10 రోమా 6:3,4). విశ్వాసము ద్వారా రక్షణ అనగా ఇదే. క్రైస్తవులు పాపము లేకుండా జీవించి నందున రక్షణపొందలేదు. గాని వారు వెలుగులో నడచినందున రక్షణ పొందారు. ఆదాము నుండి క్రీస్తు వరకు మనుష్యులు దేవుని కృప, వారి విశ్వాసముల ద్వారానే రక్షింపబడ్డారు. క్రీస్తు శిలువ వేయబడి

నప్పటి నుండి నేటి వరకూ మానవులు విశ్వాసము ద్వారా దేవుని కృప వల్ల రక్షింపబడ్డారు. విశ్వాస మూలముగా- విశ్వాసము కలుగునని పౌలు చెప్పుచున్నాడు (రోమా 1:17). అబ్రహాము పాపరహితుడు కాకపోయినను 'దేవుని స్నేహితునిగా' పిలువబడ్డాడు (యాకోబు 2:23). పాపరహితుడు కాని అబ్రహాము రక్షింపబడినట్లుగానే మనము కూడా రక్షింపబడుటకు అర్హులము.

అయ్యో నేను అపవిత్రమైన పెదవులు గలవాడను. అపవిత్రమైన పెదవులుగల ప్రజల మధ్య నివసించుచున్నాను. నేను నశించితిని (యెషయా 6:5) అని యెషయా విలపించినట్లు మనము కూడా మనమె లాంటి వారమని కాకుండా తన మహిమా ఘనతను బట్టి దేవుడు మనలను రక్షిస్తారు. మనం నశించిన వారము కాదు. మన నిరీక్షణ ఏమనగా మన విశ్వాసము ద్వారా ఆయన కృప మనలను రక్షించును. మనం దేవుని ప్రేమ, దయ, కృప పొందిన వారమైతే 1956లో మరణశయ్యపై ఉన్న వ్యక్తి యిచ్చిన స్టేట్మెంటును మనం ఇవ్వవలసిన అవసరం లేదు.

✍ - రే హాక్

# క్రీస్తు రక్తము

'అందరూ పాపులే' (రోమా 3:23) అని బైబిల్ చెబుతోంది. శిశువులు, చిన్న బిడ్డలు తప్ప మిగతా అందరూ దేవునికి లెక్కఅప్పగించవలసి ఉన్నది. మానసికస్థితి సరిగా లేనివారు కూడా దేవునికి లెక్క అప్పగించవలసి వున్నది. పాపులు యేసు క్రీస్తు రక్తం వల్ల రక్షింపబడతారని కూడా బైబిల్ చెబుతుంది. ప్రతి ఒక్కరూ దీని భావం తెలుసుకోవలసి వుంది.

క్రీస్తు రక్తము అక్షయము, నిష్కళంకమైనది.

"పితృపారం పర్యమైన మీ వ్యర్థ ప్రవర్తనను విడిచిపెట్టునట్లుగా వెండి బంగారముల వంటి క్షయ వస్తువుల చేత మీరు విమోచింపబడలేదు గాని, అమూల్యమైన రక్తము చేత అనగా నిర్దోషమును, నిష్కళంకమునగు గొర్రెపిల్లవంటి క్రీస్తు రక్తము చేత విమోచింపబడితిరని మీరెరుగుదురు గదా (1 పేతురు 1:18,19) అని క్రైస్తవులకు ఆత్మ ప్రబోధిస్తోంది.

క్రీస్తు రక్తము అక్షరార్ధంలో కల్మషము లేనిదని పేతురు ఉద్దేశం కాదు. దానీ రక్తము 'దేహమునకు ప్రాణము' (లేవీ 17:11). అని బైబిల్ ప్రబోధిస్తోంది. బైబిల్‌లో తరచుగా 'రక్తము అనే పదము 'ప్రాణము'నకు సంబంధించినదిగా ఉపయోగించబడింది (యెహెజ్కేలు 13:16-21, మత్తయి 27:4, 24, 25, అపొ.కా. 5:28).

## క్రీస్తు రక్తపు అవసరత

క్రీస్తు రక్తము ఆయన పరిపూర్ణ మానవత్వమునకు గుర్తుగా ఉన్నది (1 పేతురు 2:22-25). ఆయన రక్తము అందరిని పాపమునుండి ఎందుకు రక్షించుననగా ఆయనచే రక్షింపబడు వారందరి కంటే ఆయన జీవితము ఉన్నతమైనది.

"నిత్యుడగు ఆత్మద్వారా తన్నుతాను దేవునికి నిర్దోషిగా అర్పించుకొనిన క్రీస్తు యొక్కరక్తము నిర్జీవ క్రియలను విడిచి జీవము గల దేవుని సేవించుటకు మనస్సాక్షిని ఎంతో ఎక్కువగా శుద్ధి చేయును" (హెబ్రీ 9:14). అని హెబ్రీ గ్రంధకర్త జంతువుల, క్రీస్తు రక్తములకు గల భేదమును తెలియ జేస్తున్నాడు.

ఒకప్పుడు తన పాపముల వల్ల దేవునికి దూరమైన వారు క్రీస్తు రక్తము ద్వారా దేవునికి దగ్గరైనారని పౌలు ఎఫెస్సీలోని సహోదరులకు తెలియపరిచాడు (ఎఫెసీ 2:12-13). క్రీస్తు రక్తము ద్వారా పాపక్షమాపణ మాత్రమే గాక విమోచన కూడా కలుగుతుందని (కొలస్స 1:14) పౌలు వివరించాడు.

క్రీస్తు రక్తము విలువైన దనడానికి ఎలాంటి సందేహము లేదు. మన పాపక్షమాపణ కొరకు క్రీస్తు తన రక్తము చిందించి మనకోసం మరణించారు. అయితే ఆరక్తం ద్వారా శుద్ధీకరింప బడటానికి కొన్ని నియమాలు పాటించాలి. ఈ నియమాలు లేకపోతే అందరూ రక్షింప బడి ఉండేవారు. సర్వమానవాళి నిమిత్తం క్రీస్తు మరణించారని దేవుని వాక్యం చెబుతోంది (యోహాను 3:16, 1 యోహాను 2:2, హెబ్రీ 2:9).

## క్రీస్తు రక్తము ఎక్కడ రక్షిస్తుంది

ఆయన ఆజ్ఞలకు శిరసావహిస్తే దేవుని కుమారుడైన క్రీస్తు మన కొరకు తన రక్తం చిందించి పొందిన మరణం మన పాపములకు ప్రాయశ్చిత్తముగా అనుభవించిన శ్రమలుగా దేవుడు అంగీకరించాడు. "మన అతిక్రమములను బట్టి అతడు గాయపరచబడెను. మన దోషములను బట్టి నలుగ గొట్టబడెను. మన సమాధానార్ధమైన శిక్ష అతని మీద పడెను. అతడు పొందిన

దెబ్బల చేత మనకు స్వస్థత కలుగుచున్నది" (యెషయా 53:5). యేసు చిందించిన రక్తము వల్ల దేవుడు ఆయన చిత్తమును నెరవేర్చి విధేయత చూపువారి పాపములు క్షమించును (హెబ్రీ 5:8,9). అయితే రక్షించు శక్తి గల క్రీస్తు రక్తము పాపిని ఎక్కడకు చేరుస్తుంది?

క్రీస్తు రక్తం ద్వారా లభించే విమోచన క్రీస్తులోనే వున్నదని బైబిల్ చెబుతుంది (ఎఫెసీ 1:7, కొలస్స 1:14). గనుక క్రీస్తులో లేకుండా ఏ ఒక్కడు క్రీస్తు రక్తం ద్వారా రక్షింపబడడు. క్రీస్తు రక్తం మానవులను రక్షిస్తుందనే విషయంతోపాటు అది ఎక్కడ రక్షణనిస్తుందనేది, ఆచోటుకు చేరడం ఎలా అనే విషయాలను కూడా మనం స్పష్టంగా చెప్పాల్సివుంది. క్రీస్తులోనికి రావాలంటే క్రీస్తు రక్తం ఎక్కడ రక్షిస్తుందని తెలుసుకోవాలి. యేసే రక్షకుడని అతడు విశ్వసించాలి (యోహాను 8:24). అలా విశ్వసించినవాడు తన పాపాల విషయమై పశ్చాత్తాప పడాలి. అప్పుడు క్రీస్తులోనికి బాప్తిస్మం పొందాలి. అప్పుడు వారు క్రీస్తు రక్తం ద్వారా రక్షింపబడతారు.

మీరు మారుమనస్సుపొంది, పాప క్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసు క్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి. అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరమును పొందుదురు (అపొ.కా. 2:38). క్రీస్తు యేసులోనికి బాప్తిస్మము పొందిన మనమందరము ఆయన మరణము లోనికి బాప్తిస్మము పొందితిమని మీరెరుగరా! కాబట్టి తండ్రి మహిమ వలన క్రీస్తు మృతులలో నుండి ఏలాగు లేపబడెనో ఆలాగే మనము నూతన జీవము పొందినవారమై నడుచుకొనునట్లు మనము బాప్తిస్మము వలన మరణములో (పాలు పొందుటకై) ఆయనతో కూడా పాతిపెట్టబడితిమి (రోమా 6:34).

ఒకడు క్రీస్తు మరణములోనికి బాప్తిస్మము పొందేవరకూ క్రీస్తు మరణం వల్ల కలిగే లాభాన్ని పొందలేడు. అందుచేతనే ప్రజలను సువార్తకు లోబడవలసినదిగా మనం వారిని ఒప్పించ వలసి వున్నది. మనం క్రీస్తులోనికి ఆయన మరణంలోనికి బాప్తిస్మం పొందాలి.

✍ - బేసిల్ ఓవర్టన్

గమనిక : సత్యవాక్కు కావలసినవారు సంవత్సరమునకు 50/- రూ॥లు చందా విధిగా పంపించవలయును.

SATYA VANI, P.O. BOX-80, KAKINADA - 533 001.

# శారా

## (Sarah - Wife of the World's Most Honoured Man)

ఈ ప్రపంచములో అబ్రాహాము కున్నంత గౌరవము మరి యెవ్వరికిని లేదు. అతడు ఉన్నతమైన వ్యక్తి అని ఎక్కువైన గౌరవము కలిగి యున్నాడు. క్రైస్తవులు, యూదులు, మహమ్మదీయులు అబ్రాహాము తమ తండ్రిగా గౌరవిస్తారు. క్రైస్తవులు అబ్రాహామును తమకు ఆత్మీయ తండ్రిగాను (గలతీ 3:29), యూదులు తమ జనాంగమునకు మూలపురుషునిగాను, మహ్మదీయులు అబ్రాహాము కుమారుడైన ఇష్మాయేలు సంతానముగను గౌరవిస్తారు. కనుక శతాబ్దముల నుండి యింత గొప్ప గౌరవమును పొందిన వ్యక్తి అబ్రాహాము మాత్రమే. అట్టి గొప్ప వ్యక్తిత్వము గల అబ్రాహాముకు భార్యగా యుండుటకు శారాకు ఆధిక్యత కలిగింది.

"విగ్రహారాధనతో నిండిన కల్దీయుల ఊరను పట్టణములో అబ్రాహాము, శారాలు నివసించుచుండిరి. అబ్రాహాము తండ్రి యైన తెరహు విగ్రహారాధికుడై నప్పటికిని అబ్రాహాము పరలోకమందలి దేవుని యందు విశ్వాసముతో జీవించు చుండెను. అందుచే యెహోవా దేవుడు ఊరు పట్టణమును విడచి ఆయన చూపించ బోయే దేశమునకు వెళ్ళుమని అబ్రాహాముతో చెప్పెను (ఆది.కా. 12:13). యెహోవా దేవుని నాయకత్వముతో అబ్రాహాము, శారాలు కనానుకు యాత్రను సాగించిరి.

తన భర్తయైన అబ్రాహాము వెంట తెలియని దేశమునకు, తెలియని ప్రజల మధ్యకు శారా వెళ్ళుట కంగీకరించుట ద్వారా దేవుని యెడల ఆమెకున్న విశ్వాసమును, ఆయన మాటయెడల ఆమె చూపిన విధేయతను బట్టి దేవుడామెను విశ్వాసముగల స్త్రీలలో మొదటి స్త్రీగా ఎంచెను. హవ్వవలె దేవుని యాజ్ఞను ధిక్కరించుటకు తన భర్తను ప్రోత్సహించలేదు; లేక దేవుని యాజ్ఞను పాటించుటలో యోబు చూపిన విధేయతను తన భార్య నిరుత్సాహ పరచినట్లు అబ్రాహామును శారా నిరుత్సాహ పరచలేదు. ఆమెకు దేవుని యెడల గల విశ్వాసమును బట్టియే తాను వయస్సు గతించినదైనను గర్భమును ధరించుటకు శక్తిని పొందెను (హెబ్రీ 11:11).

విశ్వాసమనగా యేమిటి? వినుట వలన విశ్వాసము కలుగును. వినుట క్రీస్తును

గూర్చిన మాటవలన కలుగును (రోమా 10:17). కనుక విశ్వాసమనగా యెహోవా దేవుని మాటలను విని, వాటికి విధేయులమై జీవించుటయే. ఆయన వాగ్దానములను మనము హృదయపూర్వకముగ నమ్మినట్లయిన మనకు నెమ్మది, సమాధానము కలుగును. ప్రభువైన యేసు దేవుని కుమారునిగ మనము విశ్వసించాలి (యోహాను 8:24). అబ్రాహాము శారాలు దేవుని మాటకు విధేయులై విగ్రహారాధనతో నిండిన జనాంగము మధ్యనుండి దేవుడు చూపించబోయే దేశమునకు బయలుదేరిరి (2కొరింథీ 6:17-18).

క్రొత్తనిబంధనలో శారాను గూర్చి రెండు విషయాలు ప్రాముఖ్యముగ చెప్పబడినవి. (1) శారాకు దేవుని యందలి విశ్వాసము (2) తన భర్తయైన అబ్రాహాము యెడల ఆమెకు గల విధేయత. ఈ రెండు విషయాలు అన్ని కాలములలోను, అన్ని వయస్సులయందు గల స్త్రీలు అనుసరింపదగినవి. స్త్రీలారా, మీరు మీ స్వపురుషులకు లోబడి యుండుడి. పూర్వము దేవుని ఆశ్రయించిన పరిశుద్ధ స్త్రీలును తమ స్వపురుషులకు లోబడి యుండుటచేత తమ్మును తాము అలంకరించుకొనిరి. ఆ ప్రకారము శారా అబ్రాహామును యజమానుడని పిలుచుచు అతనికి లోబడి యుండెను. మీరును యోగ్యముగా నడచుకొనుచు ఏ భయమునకు బెదరక యున్నయెడల ఆమెకు పిల్లల గుదురు. స్త్రీ పురుషునకు సహాయకురాలిగా యుండుటకు నిర్మించబడెను గాని అతనిమీద అధికారము చేయుటకు నిర్మించబడలేదు (1 పేతు 3:1-6).

శారా ఎంత విశ్వాసము గల దైనను పరిపూర్ణత లోనికి రాలేదు. కరువు భారమును బట్టి వారు ఐగుప్తునకు వెళ్ళవలసి వచ్చినపుడు ఆమె యొక్క సౌందర్యమును బట్టి శారాను బ్రతుకనిచ్చి అబ్రాహామును చంపుదురనెడి భయము చేత ఆమె తన సోదరియని రాజైన అబీమెలెకునకు చెప్పుట ద్వారా అబ్రాహాము అబద్ధమాడి ఆ రాజును మోసగించెను (ఆది.కా 12:10-20). భయము పాపము చేయుటకు వారిని నడిపించెను. యేసును సిలువ వేయు సమయములో ఆయన శిష్యులు కూడ భయపడి ఆయనను తాత్కాలికముగా విడచి పోయిరి. ఆ తరువాత వారు ధైర్యపడి ప్రభువైన యేసుకొరకు చనిపోవుట మిక్కిలి శ్రేష్ఠమైన విషయముగ ఎంచుకొనిరి.

కుమారుని పొందవలెననెడి అత్యాశచే శారా యొక్క విశ్వాసము సన్నగిల్లెను. శారా చాల సౌందర్యవతి ధనికురాలు, ఘనుడైన

పురుషునికి భార్య, భర్తచే యెక్కువగ ప్రేమింపబడు చుండేది. అయినప్పటికిని ఆమె గొడ్రాలైనందువలన ఆమెలో సంతోష ములేదు. నీ సంతానమును విస్తరింప చేయుదు ననెడి వాగ్దానమును అబ్రాహాము దేవుని నుండి పొందినప్పటికిని శారా యొక్క అవిశ్వాసము బట్టి తన దాసియైన హాగరును అబ్రాహాముకు భార్యగ యిచ్చి ఆమె ద్వారా సంతానమును పొందవచ్చు ననెడి తలంపు శారాకు కలిగెను. ఇష్మాయే లును హాగరు కనిన తరువాత శారా, హాగరుల మధ్య గొప్ప తొందర కలిగి వారు కలిసి నివసింపలేక హాగరు తన కుమారుడైన ఇష్మాయేలుతో అరణ్యము నకు పారిపోయెను (ఆది.కా. 21:1-6).

ముగ్గురు దేవదూతలు అబ్రాహాము దగ్గరకు వచ్చి నీ భార్యయైన శారా నీకు ఒక కుమారుని కనునని చెప్పిన మాటలు శారా వినినప్పుడు కూడ ఆమె కొంత సందేహించెను (ఆది.కా. 18:9-15). ఆమె తన వయస్సును బట్టి సందేహించి ఆమె విశ్వాసమును తెలియజేయునట్టి నవ్వును నవ్వెను. దేవుని వాగ్దానములను శారా విస్మరించి నదే కాదని దేవునికి అసాధ్యమైన కార్య మేదియును లేదనెడి భావన ఆమెలో లేకపోయెను. అందుచే దూత ఆమెను గద్దించెను. శారా యొక్క సందేహము లన్నియు సమసిపోవు కాలము సమీ పించెను. యెహోవాకు అసాధ్యమైనదేదైన గలదా? నిర్ణయింపబడిన సమయమునకు శారా గర్భవతి యాయెను.

అబ్రాహాము శారాలు అతిధ్య మిచ్చు టలో శ్రేష్ఠులు. వారు తెలియకయే దేవ దూతలకు ఆతిధ్యమిచ్చారు (హెబ్రీ 13:2). సణగుకొనకుండ ఒకనికి ఒకడు ఆతిధ్యము చేయుడి (1పేతు 4:9). పరిశుద్ధుల అవసర ములలో పాలు పొందుచు, శ్రద్ధగ ఆతి ధ్యమిచ్చు చుండుడి (రోమా 12:13). అతిధ్య మిచ్చుటలో స్త్రీల యొక్క బాధ్యత యెక్కువగా యున్నది. ఆతిధ్యమిచ్చుట యనేది దేవుడిచ్చిన ఆజ్ఞ యైనప్పటికిని ప్రస్తుత దినములలో ఇది యెక్కువగా నిర్లక్ష్యము చేయబడుచున్నది. నీవు ఆశీర్వా దముగ యుందువని దేవుడు అబ్రాహాము నకు వాగ్దానము చేసెను (ఆది.కా. 12:2). అబ్రాహాము శారాల విశ్వాసమును బట్టి దేవుడు వారికి గొప్ప ఆశీర్వాదముల నిచ్చెను.

శారా ఇస్సాకును కనుట ద్వారా గొప్ప ఘనత పొందెను. ఇస్సాకు వంశములో నుండియే క్రీస్తు ప్రభువు జన్మించెను. అందునుబట్టి ఈ భూలోకము ఆశీర్వాద మును పొందెను. వయస్సు మించినట్టివారు

దేవునికి కావాలి. నెరసిన వెంట్రుకలు సొగసైన కిరీటము (సామె 16:31). అవి నీతి ప్రవర్తన కల వానికి కలిగి యుండును. పెద్దవారందరు తెలివైనవారు కారని మనము ఏలీహును బట్టి గ్రహించగలము. (యోబు 32:4-9). కాలేబు విషయము చూచినట్లయితే ఎనుబదియైదు సంవత్సరముల వయస్సు నుండి నప్పటికి కష్ట సాధ్యమైన ప్రదేశమును తమకు స్వాస్థ్యముగా యిమ్మని అడుగుచున్నాడు. కాలేబువలె ధైర్యముతో, ఓర్పుతో యున్న వారు దేవుని కొరకు కావాలి. వయస్సులో పెద్ద వారైనట్టి వారు సాధారణంగా మంచి అనుభవం గలవారై యుండి చిన్నలకు తగు సలహాలు యివ్వగలరు. మంచి మార్గములో నడిపించు వారై యుండగలరు.

ప్రపంచములో కొన్ని ఘనమైన కార్యాలు చేయగలిగినటువంటి వారు పెద్దవారే. చిన్నలకు లేనట్టి ఓర్పు పెద్దవారిలో యుంటుంది. కనుక అటువంటి పెద్దవారే దేవునికి కావాలి.

దేవుని చిత్తమును నెరవేర్చుటకు ప్రభువైన యేసు ఈ లోకములోనికి వచ్చెను. ఆయన రాక మునుపు మోషే ధర్మశాస్త్రము విగ్రహారాధికులైన జనాంగములకు దేవుని గూర్చిన జ్ఞానము కలిగించుటలో ఒక ఉపాధ్యాయుని వలె పని చేసింది. ప్రభువైన క్రీస్తు ధర్మశాస్త్రమంతటిని నెరవేర్చి దానిని సిలువకు కొట్టెను గనుక మనము ధర్మశాస్త్రమునకు బాధ్యులము గాక ప్రభువైన యేసు చిత్తానుసారముగ జీవింప బద్ధులమై యున్నాము.

✍ - లోటీ బెత్ హాక్స్

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న 'సత్యవాణి' టి.వి. కార్యక్రమములను ప్రతి మంగళవారం ఉదయం 6:30 గం॥లకు **MAA** టి.వి. లోను మరియు ప్రతి శనివారం ఉదయం 6:30 గం॥లకు **తేజ ఛానల్** లోను చూడండి.

# మత సంబంధ నామములు, బిరుదులు

(Religious Names and Titles)

మానవుడు డాంభికుడు, పేరు ప్రఖ్యాతులనతడు ప్రేమించును. బిరుదుల కొరకు, బలము కొరకు అతడనేక ప్రయత్నములు చేయును. క్రైస్తవునివలెను, బోధకుని వలెను ఉంటే అతనికి సరిపోదు. ఇంకా ఎక్కువ అతనికి కావలెను. ఈ అభిలాషను తీర్చుకొనడానికి, మానవుడు తన కిష్టము వచ్చినన్ని నామములను, బిరుదులను హోదాలను, ఆచారములు కల్పించెను. అందువలననే దేవునితో ఆరంభించని నామములను, బిరుదులను హోదాలను మనుష్యులు కలిగియుండుట ఈనాడు గమనించగలవు. ఇట్టివాటిని గూర్చి దేవుడు వ్యతిరేకముగ మాటలాడెను. వాటిలో కొన్నిటిని ఇప్పుడు పరిశీలించుదము.

**1. రెవరెండ్ :** దీనిని అనేక మంది ఒక గొప్ప బిరుదుగా ధరించు కొను చున్నారు. దానితో సరిపోక ఇంకా ఎక్కువ గొప్పతనము ఆ బిరుదులో కల్పించుటకు "రైట్ రెవరెండ్" అని యనిపించు కొను చున్న వారున్నారు. అయితే ఈ బిరుదును ధరించుకొను వారుగాని, దానిద్వారా వారిని గౌరవించు వారికి గాని "రెవరెండ్" అను పదము బైబిలులో ఒక్కసారి మాత్రమే వినియోగించబడెనని అది దేవునికి మాత్రమే వర్తించునని యెరుగక యున్నారు. దేవుని గూర్చి దావీదు పలుకుచు "ఆయన నామము పరిశుద్ధమైనది పూజింప తగినది (Holy and Reverend is His Name) యని చెప్పెను (కీర్తనలు 111:9). నీవు దేవుడవా? మీ బోధకుని రెవరెండ్ అని పిలుచూ మీ సంగతియేమి? అతడు దేవుడా? ఈ పదమును మానవులకు వినియోగించు వారందరికీ సిగ్గు కలుగును గాక. అది దేవునికి మాత్రమే చెందును. దానిని ఆయన నుండి తీసివేయ ప్రయత్నించవద్దు.

**2. ఫాదర్:** వేలకొలది మతగురువులు 'ఫాదర్' అని పిలువబడుచున్నారు. 'ఫాదర్' (తండ్రి) అని మాత్రమే కాదుగాని "హోలి ఫాదర్" (పరిశుద్ధ తండ్రి) యని కూడ పిలువబడుచున్నాడు. ఈ బిరుదును తగిలించుకొనిన వారిని మరింకో విధముగా పిలిచినా వారికి నామోషి యగును. అట్టి వారందరు యేసు చెప్పిన సంగతి జ్ఞాపకముంచు కొనవలెను; "మరియు భూమి మీద ఎవనికైనను తండ్రి అని పేరు పెట్టవద్దు. ఒక్కడే మీ తండ్రి. ఆయన పరలోక

మందున్నాడు" (మత్తయి 23:9). అట్టి నామకరణములను ధరించుట దేవుని వ్యతిరేకించుట యని గ్రహించవలెను.

**3. పాస్టర్ :** డినామినేషన్ సంఘస్థులు వారి బోధకులను పాస్టర్ అని పిలుచు చుందురు; ఆ బోధకులు అట్లు పిలుచు కొందురు. వాక్యమును బట్టి చూచిన యెడల "పాస్టర్" అను పదము ఇట్లు ఉపయోగింపబడలేదు. 'పాస్టర్' అనగా సంఘకాపరి యని అర్థము. మనము 'కాప రులను' గూర్చి చదువగలము గాని 'కాపరి' గూర్చి బైబిలునందు చదువలేము. కాపరు లుగా నియమింపబడినవారు 1తిమోతి 3లోను, తీతు 1లోను పౌలు ఉదహరించిన అర్హతలను నెలకొల్పినపుడే వారు నియ మింపబడిరి. వారు అధ్యక్షులనియు పెద్ద లనియు, కాపరులనియు, ప్రెస్బిటర్ ళనియు పిలువ బడిరి. ప్రతి స్థానిక సంఘ ములోను ఒకరి కంటె ఎక్కువ కాపరులు లేక పెద్దలు ఉండిరి. నేడు క్రైస్తవులమని చెప్పుకొనువారు ఉపయోగించు కొనునది బైబిలు ప్రకారము లేని ఒక మతాచారము.

**4. డాక్టర్ :** డాక్టరేట్ డిగ్రీ వచ్చువరకు ఎవరైనను విద్యనభ్యసించిన యెడల, ఆ బిరుదును మతబిరుదుగా వినియోగించ నవసరము లేదు. అట్లు వినియోగించిన యెడల దాని ప్రయోజనమును కోల్పోయిన దగును. గొప్ప తనముతో అధికారమును సంపాదించాలనెడి అభిలాషను యేసు ఖం డించెను (మత్తయి 20:25-27).

**5. పోప్ :** బైబిలులోని లేని బిరుదు ఇదియే. దేవుడు గాని, క్రీస్తుగాని, వాక్యముగాని ఎవడైనా ఒక మానవుడు భూమిపై సంఘ శిరస్సుగా నుండవలెనని అతడు పోప్ అను బిరుదును ధరించవలె నని బోధించుట లేదు. అది దేవుని సంబంధమైనది కాదు. క్రీస్తే సంఘమునకు శిరస్సై యున్నాడని వాక్యము చెప్పుచున్నది (కొలస్స 1:18; ఎఫెసీ 1:22 23). ఒక మానవుని సంఘ శిరస్సుగా నియమించిన యెడల క్రీస్తు జీవించుట లేదుగాని మరణించెనని యర్థము!

పైన చెప్పబడిన బిరుదులేగాక, వేలకొలది ఉన్న - అట్టి బిరుదులన్నిటిని లేఖనములు నిషేధించుచున్నవి. దేవుని తల్లి, ప్రీస్టు, బిషప్, ఆర్చిబిషప్, ప్రెసిడెంట్ పాస్టర్ ఇన్‌చార్జ్ మొదలగునవన్నియును నిషేధింప బడినవి. ఈ బిరుదులన్నియును దేవుని అనుమతి లేకుండగనే మానవులు కల్పించు కొనినవి. ప్రజలు ఈ సంగతి ఎందుకు గ్రహించుట లేదు? దేవుని చిత్తము నకు వ్యతిరేకముగా ఎందుకు నడుచు కొనవలెను? మానవులు దేవుని కంటె

ఎక్కువ ఘనతను కోరుటలో ఇట్లు అవిధేయత చూపుచు దేవునిపై తిరుగు బాటు చేయుచున్నారు.

క్రైస్తవలోకము ఎందుకు విభజింపబడి యున్నది? ఇది ఒక కారణము. ఐక్యత కొరకు సామాన్య మత బోధకుడు ఈ బిరుదులను పరిత్యజించ గలడని నీవనుకొనుచున్నావా? అనేకులు అట్లు చేయరు. వారికున్న గర్వము చాలా ఎక్కువ. తమ్ము తామే ఎక్కువుగా వారు ప్రేమించు కొనుచున్నారు. దీనిని చదువుచున్న ప్రతి మత నాయకుడు తాను ధరించిన బిరుదులను వెంటనే వదిలి వేయునని ఉద్దేశంతో దీనిని వ్రాయుట లేదు. వారట్లు చేయలేరని నేనెరుగుదును. అయితే ఈ అంశముపై నున్న దోషమును తొలగించి సత్యమును తెలియని వారికి చూపించుట కిది వ్రాయబడెను. ఈ సంగతులను గూర్చి ఏమియు ఆలోచించ కుండగనే నీ జీవితమును నీవు గడిపివేయు చుండవచ్చును. వాక్యప్రకారము లేని ఈ బిరుదులనుపయోగించుచు మొదటి నుండి చివరకు గ్రుడ్డివారి వెనుక గ్రుడ్డితనముగా వెంబడించు చుండవచ్చును. అందువలన నీవు సామాన్య సభ్యుడవనయు, (Laity) వారు యాజకులనియు (Clergy) అనుకొనవచ్చును. ఇట్లున్న స్థానభేదములు కూడ వాక్యములో లేనివే. నీవు చేయుచున్న దానిని గూర్చి మెళకువ కలిగి యుండుము. నా మాటలు నీవు నమ్మనవుసరము లేదు గాని బైబిలు నందు పరీక్షించుము. అందు రెవరెండ్ పేతురు అనిగాని, డాక్టర్ పౌలు అనిగాని, పాస్టర్ యోహాను అని గాని వ్రాసియున్నదేమో కనుగొనుము. సువార్తను బోధించువా డెన్నడైనను ఫాదర్ అనిగాని, పోప్ అనిగాని పిలువబడెనేమో చూడుము. Clergy మరియు Laity అను పదములు వాక్యమునందున్నవేమో గమనించుము. అట్లు చూచిన యెడల నీవు సత్యమును తప్పక కనుగొందువు.

అయితే ఆనాడు క్రైస్తవ నాయకులు ఏమని పిలువబడిరి? బోధకులు, ఉపదేశకులు, సువార్తికులు, పెద్దలు, క్రైస్తవులు, సహోదరులు అని పిలువబడిరి. ప్రభువు సంఘమయితే క్రీస్తు నామమును ధరించెను. వాక్య ప్రకారము నడువగలిగి నప్పుడు దానికి వ్యతిరేకముగా ఉండనవు సరము లేదు, సత్యమును అవలంబించ గలిగినప్పుడు అసత్యమును వెంబడించవద్దు. ప్రభువు యిచ్చిన నామములను, బిరుదులను మాత్రమే ధరించుదము. అప్పుడు మాత్రమే మనము సరిగయుండగలము.

- జె.సి. ఛోట్

# దేవుడు ఎక్కడ నుండి వచ్చాడు?

(Where did God come from?)

పై ప్రశ్నను సహృదయం కలిగిన వారు తరచు అడుగుదురు. అది యువకుల మనస్సులో తరచు ఉద్భవిస్తు యుంటాది. కొన్ని సందర్భాల్లో నాస్థికులు తమ వాగ్వాదాల్లో ఈ ప్రశ్నను అడుగుతారు. అయితే ఈ విశ్వము, పదార్థము ఎక్కడ నుండి ఉద్భవించిందని వారిని ప్రశ్నిస్తే దానికి వారు జవాబీయక మౌనులై యుంటారు. "దేవుడెక్కడి నుంచి వచ్చాడో చెబితే, పదార్థము, శక్తి ఎక్కడి నుండి వచ్చాయో మేమును ఖచ్చితంగా చెప్పుదమని వారంటారు. "క్రైస్తవులు దేవుని ఆరంభాన్ని గూర్చి చెప్పలేరు. అందువలన పదార్థము యొక్క ఆరంభాన్ని గూర్చి చెప్పలేరు. అందువలన పదార్థము యొక్క ఆరంభాన్ని గూర్చి నేను జవాబీయ నక్కర్లేదని" నాస్తికుడు తలస్తాడు. అయితే అట్టి ఆలోచన సరికాదు.

మొదటిగా, నిర్దేవుడు పదార్థమును శక్తిని దేవునితో పోల్చుచున్నాడు. పదార్థము, శక్తి యొక్క ఆరంభము నిరూపించబడినది. దేవుడైతే ఆరంభము లేనివాడు. అందువలన అనిత్యాన్ని నిత్యత్వంతో అతడు పోల్చుచున్నాడు. అది అసాధ్యం, అవివేకం, ఆరంభాన్ని గూర్చి అట్లు పోల్చడం అర్థరహితం. రెండవదిగా, నిర్దేవుడు తన పొరపాటు ఫలితంగా వేదాంత పరంగా భావరహిత ప్రశ్నను లేవనెత్తాడు. అంటే అర్థంలేని ప్రశ్నకు జవాబీయలేము ఏలయనగా అతని ప్రశ్నలో అర్థంలేదు.

దేవుడు ఎక్కడ నుండి వచ్చాడు? అని నిర్దేవుడు అడిగాడు. అంటే దేవుడు ఏదో ఒక చోట నుండి వచ్చాడు. గనుక ఆయనకు ఆరంభం వున్నదని అతని ఉద్దేశ్యం. కాని నిర్వచనాత్మకంగా దేవుడు నిత్యుడు. ఆయనకు ఆది లేదు. నిత్యునికి ఆరంభం లేదు. గనుకనే ఆయన నిత్యుడు. నిర్దేవుడు ఆమోదయోగ్యము కాని తారతమ్యాన్ని (నిత్యం Vs అనిత్యం) అతడు లేవనెత్తినందువలన పొరబడ్డాడు. అంతేకాదు. నిత్యత్వం గల వ్యక్తికి (దేవునికి) ఆరంభం వున్నదని తలచుటలో కూడ పొరబడ్డాడు. దేవుడు ఎక్కడ నుండి రాలేదు. ఎక్కడికీ వెళ్లుట లేదు. ఏలయనగా ఆయన ఆద్యంతము లేనివాడు.

- బెర్ట్ తామ్సన్

సంక్షిప్త ప్రసంగము

# ఆరాధనలో మనకుండవలసిన మనస్సు

(Attitudes we need in Worship)

పరిచయం : దేవుని కంగీకార యోగ్యముగా ఆరాధించుటే మన కర్తవ్యం. మన మనస్సును బట్టి ఆరాధన యెట్లుండునో గుర్తించ దగును. ఆరాధనలో ఎట్టి స్వభావము మనం కలిగి యుండాలి ?

1. ఆరాధన కొరకు మనం సిద్ధపడాలి : సిద్ధపాటు వలన మన మనస్సు స్థిరపరచబడతాది. పాప స్వభావము సరిజేయబడాతి. (పగ, ద్వేషము మొ॥నవి) మత్తయి 5:23-24.

2. ఆత్మతో ఆరాధించాలి : యోహాను 4:23-24; యెహోషువ 24:14-15; ఎఫెసీ 6:24. ప్రేక్షకులుగా కాదు గాని ఆరాధనలో పాల్గొనే వారిగ యుండాలి. ఆరాధనలో హృదయం నిమగ్నమై యుండాలి. మత్త 15:7-8. అనేకులు కాలక్షేపానికి ఆరాధనకు వెళ్తారు. అట్లుండరాదు.

3. సత్యముతో ఆరాధించాలి : యోహాను 4:23-24; దేవుని హెచ్చరికలను గైకొనకుండా చేసే ఆరాధన వ్యర్థము. మత్త 15:9 మనం దేవుని అధికారాన్ని మన్నించు చున్నామా? యోహాను 10:35; ద్వితీ 4:2; 12:32; సామె 30:6; ప్రకటన 22:18-19; గలతీ 1:8,9; 2 యోహాను : 9.

4. ఆరాధన ధన్యతను గుర్తించాలి : ఆరాధించడం గొప్ప భాగ్యం. అబ్రాహాము తరుచు ఆరాధించేవాడు. ఆది.కా. 12:7,8; 13:3; 22:9 ఆరాధనకు ఆసక్తితో వెళ్లాలి. దాన్ని నిర్లక్ష్యం చేయకూడదు.

5. ఆరాధనలో క్రమం నడిపించు వారిని విమర్శించరాదు : వారిలో తప్పులు కనుగొనుట కంటే, నడిపించేవారిని ప్రోత్సహించాలి. ఇతరులను మనం ప్రోత్సహించాలి, నిరుత్సాహపర్చకూడదు, 1 కొరింథీ 14:12.

నీవు ఇతరులను ప్రోత్సహించునప్పుడు, ఆరాధనలో గొప్ప భావం నీకు కనబడును.

**6.** ఆరాధన వలన మన జీవితాలు బాగుపడాలి : ఈ రోజు నా జీవితం బాగు పడ్తాది అనుకోవాలి. నీవు ఆరాధన చేసే కొలదీ క్రీస్తు సారూప్య ములోనికి మార్చబడతావు. ఆరాధన మన ఆత్మలకు సేద దీర్చుతాది; నూతన ఆనందం కలిగించ బడ్తాది (కీర్తనలు 23). మనం 70 సంవత్సరములు బ్రతికితే, 10 సంవత్సరములు ఆరాధనలో గుడుపుతాం ! దేవుని సన్నిధిలో అట్టి సమయం మనకెంతమేలో కదా !

ముగింపు : ఆరాధనలో మన మనోభావాలను బట్టి మన ఆరాధన అంగీకార యోగ్యమైనదో కాదో తెలియనగును. ఆరాధనలో నీ స్వభావం ఎట్లున్నది? పరీక్షించుకో.

✍ - కెన్ టైలర్

RNI Regd. No. 69973/98
Postal Regd. No. VM/KD/02

From:
SATYA VAKKU
P.O. Box 80,
Kakinada - 533 001

To

Edited & published by Joshua Gootam Printed by him at Satya Vani Publications, Sambhamurthy St. Kakinada-533 004.